


# జాతకం

**వీరభద్రరావ్ పమ్మి**

మనుషుల ఉజ్వలమైన భవిష్యత్తునీ అందుకు
దోహదం చేసే జాతకాలనీ నిర్మించాల్సింది మనుషులే

మధ్యతరగతి మనుషులంత దొంగలు మరే తరగతిలోను వుండరు. నీతులు చెప్తారు. వీలైనంత వరకు వాటిని పాటించరు.' సాంప్రదాయం, సాంప్రదాయం' అంటారు. నిజంగా సాంప్రదాయం మీద గౌరవం కాదు, సంఘమంటే వుండే భయం అనుకుంది భువనేశ్వరి.

సాంప్రదాయ భీరువుకీ
అస్వతంత్ర వితంతువుకీ
వసంతం లేదు-

ఎవరా మాటలన్నది... తిలక్ కదూ!,

నిజమే- సాంప్రదాయాన్ని ఎదిరించాలి. అస్వతంత్రతని ఛేదించాలి.. అని కూడా అనుకుంది భువనేశ్వరి.

"ఇంట్లో కళ్ళన్నీ నన్నే వెంటాడుతున్నాయి. ఏం చేసినా నీదే భారం... త్వరగా ఏ విషయం రాయి" అని రాసిన కాయితం అతి కష్టం మీద కమలాకర్‌కి పంపింది.

జవాబు కోసం ఎదురు చూస్తోంది.

కమలాకరం వుండేది పక్క మేడ మీద గదిలో! అయినా అతన్ని కలవడం, మాట్లాడ్డం చాలా కష్టమైపోయింది. తల్లి, తండ్రి, తమ్ముడు, మొగుడు వదిలేసిన అప్పగారు, చివరికి పనిమనిషి- ఇంతమంది కళ్ళు తనని గమనిస్తున్నాయి, వెంటాడుతున్నాయి, వేటాడుతున్నాయి.

అయినా ఏదో తెగింపు, పట్టుదల భువనేశ్వరిని కదిపి, కుదిపి, నిలవనియ్యకుండా కాళ్ళ కింద నిప్పులు పోస్తున్నట్టుగా చేస్తున్నాయి.

ఏమైనా సరే- ఏది ఏమైనా సరే... తెగించాలి.

తెగించకపోతే తనకి నిష్కృతి లేదు.

తెగించకపోతే ఇలాగే- తన జీవితం మొద్దుబారి పోయి, మోడైపోయి కాలపు మంటలకి మాడి మసైపోతుంది.

ఆరోజంతా ఆమె ఎదురు చూస్తూనే వుంది- కమలాకరం జవాబు కోసం...

సాయంత్రం ఆమె గదిలో నిలబడి కిటికీ లోంచి పెరట్లోకి చూస్తూనే వుంది.

ఓ చిన్న రాయి వచ్చి గుబురుగా వున్న మల్లె మొక్కల మధ్యలో పడింది. ఆ రాయికి ఓ చిన్న కాయితం రబ్బరుబ్యాండ్‌తో చుట్టబడి వుంది.

'హమ్మయ్య! జవాబు వచ్చింది. నా భవిష్యత్తు నిర్ణయమైపోయింది' అనుకుంది.

మెల్లగా వెళ్ళి ఉత్తరం తీసుకోవాలనుకుంటూండగానే 'అమ్మోయ్! కొంప మునిగిపోయింది' అనుకుంది.

ఆమె తండ్రి వెళ్ళి మల్లె మొక్కల మధ్య వున్న రాయి తీసి- ఉత్తరం తీశాడు.

ఆ క్షణంలోనే ఆమె భవిష్యత్తు నిర్ణయమైపోయింది. తండ్రి తనని గమనించకుండా ఆమె కిటికీకి దూరంగా జరిగింది.

తండ్రి ఆమెను ఏమీ అడగలేదు. ఇంట్లో ఆ విషయం చర్చకే రాలేదు. మర్నాడు "బట్టలు సర్దుకో. రేపు తీసికెళ్ళి మీ అత్తవారింట్లో దింపేసి వస్తాను" అన్నాడు తండ్రి.

"నేను కమలాకరాన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" తల వొంచుకునే చెప్పింది కానీ- ధైర్యంగానే చెప్పింది.

"నువ్వు ఆ ఇంటి కోడలువి. నీ భవిష్యత్తు నిర్ణయించాల్సింది వాళ్ళు" అన్నాడు.

కమలాకరం రాసిన ఉత్తరంలో ఏముందో ఆమెకి తెలియదు. అతను భీరువు కాదు. అందుచేత ఏదో గట్టి నిర్ణయమే తీసుకుని ఆ విషయం తెలియపరచి వుంటాడు. లేకపోతే 'నాన్న అత్తవారింటి దగ్గర



దింపేసే నిర్ణయం తీసుకోడు' అనుకుంది భువనేశ్వరి.

ఆయన తన గదిలోకి వెళ్ళి కమలాకరం రాయి ద్వారా పంపిన ఉత్తరం జేబులోంచి తీసి మళ్ళీ చదివాడు.

"రేపు రాత్రి పది గంటలకి బస్టాండు దగ్గరకి రా. బట్టలు, నగలు ఏవీ తేవద్దు. కట్టుబట్టల్తో వచ్చెయ్. నా దగ్గర డబ్బుంది. పెళ్ళి చేసుకుని నెల రోజులు పోయాక తిరిగివద్దాం." అంత కోపంలోనూ ఆయనకి కమలాకరం సిన్సియారిటీకి ముచ్చటేసింది.

నగలు తేవద్దని మరీ రాశాడు.

అంటే-

ఆమెను నిజంగానే ప్రేమిస్తున్నాడన్నమాట!

వైధవ్యం పొందిన ఆమెను పెళ్ళి చేసుకుని నిజంగా ఆమెతో బతకాలనుకుంటున్నాడన్నమాట!

కాని తను ఎలా ఒప్పుకోగలడు?

వీరేశలింగం గారి విధవా వివాహోద్యమం ఆయనతోనే ముగిసిపోయింది. మనవాళ్ళు ఏ సమస్య తీసుకున్నా రచనల్లో, నాటకాల్లో, సినిమాల్లో దాన్ని విపరీతంగా ప్రచారం చేసి చేసి విసిగి వేసారి ఊరుకుంటారు.

సమస్య మాత్రం అలాగే వుంటుంది. ఈ సమస్యా అలాంటిదే-

'నిజనే- చాలా చిన్న వయసులోనే ఆమె భర్తని పోగొట్టుకుని ఏ సరదాలు లేక, ఏ సౌఖ్యాలు లేక మోడులా బతుకుతోంది. అలా ఒక రోజు కాదు- రెండు రోజులు కాదు. ఏళ్ళ తరబడి, దశాబ్దాల తరబడి బతకాలి. ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకోడం సహజం... అతి సహజం.

కాని సమాజం?

ఇంకా ఆమెకిద్దరు చెల్లెళ్ళున్నారు. వాళ్ళకి పెళ్ళి కావాలి. ఈమె జీవితపు నీడ తప్పకుండా వాళ్ళ మీద పడుతుంది. సమాజం విసిరే విమర్శా బాణాలకు తట్టుకోవాలి. జన్మంతా భయం భయంగా బతకాలి.

"నో నేనంగీకరించను" అన్నాడు తండ్రి.

కూతుర్ని తీసికెళ్ళి ఆయన అత్తవారింట్లో దింపేసాడు. ఆమె తండ్రి, మామగారు గదిలో చాలాసేపు రహస్యంగా మాట్లాడుకున్నారు. ఏం మాట్లాడుకున్నారో ఆమెకి తెలియదు.

ఆ మర్నాడు తండ్రి తన ఇంటికి వెళ్ళిపోయాడు. ఆమె అదే రోజు కమలాకరానికి ఉత్తరం రాసింది. తన పట్టుదల సడలలేదని, అతనితో ఎక్కడికైనా ఆఖరికి నరకానికైనా వస్తానని తెలియజేసింది.

అతన్నుంచి జాబు వస్తుంది. తండ్రి చెప్పే వుంటాడు కాబట్టి మావగారు తప్పకుండా ఆ ఉత్తరం చూస్తాడు. చూసి ఇదేమిటని గర్జిస్తాడు- ఈ రకంగా అసలు విషయం ఆయనకి తెలియజెయ్యొచ్చు - అనుకుంది భువనేశ్వరి.

నాలుగు రోజుల్లో కమలాకరాన్నుంచి జవాబు వచ్చింది.

"ఇదిగోమ్మా- ఉత్తరం వచ్చింది" అని మామగారు ఆమెకు అందజేశాడు. ఆమె కొంచెం డిజప్పాయింట్ అయింది.

ఆయనేమీ అడగలేదని-

ఆమె హృదయం పేలడానికి ముందు లోపల్లోపల ఉడికిపోతున్న అగ్నిపర్వతంలా వుంది. పేలిపోతే బాగుండునని ఆశగా వుంది.

"ఎక్కడ్నుంచి ఉత్తరం?"

భోజనం చేస్తున్నపుడు అడిగాడు.

"కమలాకరం అని మా ఊరే"

"అలాగా"

ఆమె మళ్ళీ నిరుత్సాహపడింది.

"నా స్నేహితుడు' ఆమే చెప్పింది.

ఆయన ఆమె మొహంలోకి చూసి ఊరుకున్నాడు.

అతన్ని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను- అని చెప్పేద్దాం అనుకుంది. ధైర్యం చాలలేదు.

అవునా- మీ అబ్బాయిని కట్టుకుని నేనేం సుఖ పడ్డాను. కాపురం చేసినంత కాలం రోగంతో తీసు కుంటున్న అతనికి సేవ చేస్తూ, మందులు మింగిస్తూ, అతనెప్పటికైనా లేచి నన్ను అక్కున చేర్చుకుంటా డన్న ఆశతో బతికాను.

మీరంతా కలిసి ఓ రోగిష్టివాడికి నన్ను కట్టి నా బతుకు నాశనం చేశారు.

ఆ రోగిష్టివాడు ఢాం అన్నాడు. చేసిన వెధవ పనికి సిగ్గు పడాల్సింది పోయి- మీరు, మా నాన్న సాంప్ర దాయం, సాంప్రదాయం - అని వేళ్లాడుతున్నారు. ఏమిటండీ- సాంప్రదాయం- వల్లకాదు సాంప్రదాయం. రోగిష్టివాడికి పెళ్ళి చేసి నన్ను విధవని చేసి, జన్మంతా దిక్కులేనిదానిలా ఏ అచ్చట ముచ్చటా లేకుండా, ఓ మనిషంటూ నాకు లేకుండా మోడులా, గొడ్డులా బతికేట్టు- నా జీవితాన్ని హీన స్థితికి దిగజార్చిన మీరు మనుషులా? కాదు మావయ్యగారూ- మీరు మను షులు కాదు, మృగాలు. మీరంతా మృగాలండీ-

అని అనాలనుకుంది.

కాని ఆ విషయం ఆయన ఎత్తకుండా ఎలా అనడం అని ఊరుకుంది.

చిత్రం!

ఓ వ్యక్తి సెలూన్‌లో "బాబూ! నిన్ను గడ్డం చేయమన్నాను కానీ గడ్డంతో పాటు చర్మాన్ని కూడా కత్తె రించమనలేదు!"

"ఫర్వాలేదు సార్. మీరు గడ్డం చేసినందుకు మాత్రమే డబ్బులి వ్వండి. నేనేం అనుకోను!"

-జి. రమ

హైదరాబాద్

ఆమె అలాంటి మాటలంటుందని భయపడే ఆయనా ఆ విషయం ఎత్తలేదు.

ఆ రాత్రి ఆమె మళ్ళీ కమలాకరం ఉత్తరం చదువుకుంది. "నువ్ వెంటనే ఉత్తరం రాయి. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను. నిన్ను స్వీక రించడానికి సిద్ధంగా వున్నాను"

ఒక్కసారి మావగారితో కూడా ఆ విషయం చెప్పి తుది నిర్ణయం తీసుకుందామనుకుంది.

ఆయన సోఫాలో కూర్చుని పేపర్ చదువుకుంటు న్నారు.

"మీతో కొంచెం మాట్లాడాలి మావయ్యా"

"చెప్పమ్మా..."

"నేను... నేను.. కమలాకరాన్ని పెళ్ళి చేసు కుందామనుకుంటున్నాను"

"మీ నాన్నగారేమన్నారు?"

"వీల్లేదన్నాడు. అందుకే నన్ను తీసుకొచ్చి ఇక్కడ దింపేసాడు"

"ఎందుకు వీల్లేదన్నారు?"

"సాంప్రదాయం కాదుట- మా చెల్లెళ్ళకి పెళ్ళి ళ్ళవ్వవుట. తను తల ఎత్తుకుని తిరగలేట్ట"

"కమలాకరం ఏం చేస్తాడు?"

"మా ఊళ్ళో కాలేజీలో లెక్చరర్"

"అతను నిన్ను మోసం చెయ్యడని, చివరికంటా అన్ని ఆటుపోట్లు భరించి నీతో వుంటాడని నీకు నమ్మకం వుందా?"

"ఉంది. మనుషుల మీద నా అంచనా తప్పదు."

"మరి నా ఆస్తి-"

"నాకేమీ అక్కర్లేదు. కట్టుకున్న చీరతో వెళ్ళి పోతాను"

"నాకు ఒక్కడే కొడుకు. చిన్నప్పట్నుంచి రోగిష్టి. నాకు జాతకాల పిచ్చి వుంది. ఆ విషయం నీకూ తెలుసు. జాతకాలు చూసుకునే వాళ్ళు దాని మీద ఆధారపడి భవిష్యత్తు తెలుసుకుంటారు. కొందరు జాగ్రత్తపడి భవిష్యత్తు నిర్మించుకుంటారు.

మా వాడికి పెళ్ళి చేస్తే రోగం తగ్గుతుందని జాతకం ద్వారా తెలిసింది.

అందుకే నిన్ను వాడికి చేసాను. వాడు బతికి నన్నాళ్ళు నువ్వు ఎంత యాతన పడ్డావో నాకు తెలుసు. వాడు పోయాక- నీ భవిష్యత్తు తల్చుకుని నేనెంత బాధపడ్డావో భగవంతుడికి తెలుసు.

నిన్ను చూస్తే మోడులా బతికెయ్యడానికి నిర్ణ యించుకున్నట్టుగా తోచింది. మళ్ళీ పెళ్ళి చేసుకోడం నీ కిష్టమో కాదో నాకు తెలియదు. ఆ మాట అడిగి నిన్ను నొప్పించడం ఇష్ట ంలేదు.

కమలాకరం మా దూరపు బంధువు.

వాడికా ఊళ్ళో లెక్చరర్ ఉద్యోగం నేనే వేయిం చాను. నిన్ను పరిచయం చేసుకుని నీ మనసు తనవైపు మళ్ళించుకొమ్మని నేనే చెప్పాను..."

"మావయ్యా..."

"అవునమ్మా- చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం వచ్చే జన్మలో కాదు- ఈ జన్మలోనే తీర్చుకోవాలి. అది నా సిద్ధాంతం.

రోగిష్టివాణ్ణి కట్టి నీ జీవితం నాశనం చేశాను.వాడి ఆరోగ్యం కుదుట పడుతుందన్న ఆశతో మాత్రమే అలా చేశాను.

జాతకాలు చూసి మనుషుల భవిష్యత్తు నిర్మించ వచ్చని పూర్వం నమ్మకం వుండేది.

ఇప్పుడలా కాదు-

మనుషుల భవిష్యత్తు, జాతకం మనమే నిర్మించ వచ్చన్న నమ్మకం ఏర్పడింది.

వచ్చే ఆదివారం కమలాకరాన్ని నేను దత్తత చేసుకుంటున్నాను. మర్నాడు మీ పెళ్ళి...

ఈ విషయం మీ నాన్న గారికి రాస్తాను. ఒప్పుకుంటారో లేదో నా కనవసరం నువ్వు మా ఇంటి కోడలివి. నీ జీవితం మీద సర్వ హక్కులు మావి"

భువనేశ్వరి కదిలిపోయింది.

చలించిపోయింది

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

ఆనందంతో, ఆశ్చర్యంతో, కృతజ్ఞతతో-

# 'కోకాకోలా' తెచ్చిన కంగారు!?

వివిధ దేశాల మధ్య, వర్గాల మధ్య ఎడాపెడా యుద్ధాలు జరుగుతున్నట్టే ఇటీవల శీతల పానీయాలు తయారుచేసే కంపెనీల మధ్య కూడా ప్రచ్ఛన్న పోరాటం జరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌ను అదరగొట్టేస్తున్న కూల్‌డ్రింక్స్ మన దేశంలోకి అడుగు పెడితే మా కొంప మునిగిపోతుందో- అంటూ మన దేశంలోని కూల్‌డ్రింక్స్ తయారీదార్లు ఒక్రపక్క గగ్గోలు పెడు తుంటే, ఎలాగైనాసరే తమ కూల్ డ్రింక్స్ రుచి చూపించి భారత మార్కెట్‌ను కబళించేయాలని 'కోకాకోలా', 'పెప్సీకోలా' తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఈ సుదీర్ఘ పోటీ లలో ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని అతి కష్టం మీద పెప్సీకోలా కంపెనీ పంజాబ్‌లో ఒక ప్లాంట్ నెలకొల్పడానికి భారత ప్రభుత్వం నుంచి ఆమోదాన్ని కొట్టేయగలిగింది. ఇదే అదనుగా కోకాకోలా కంపెనీ కూడా అట్టే కష్టపడ కుండా నోయిడా వద్ద ఒక ప్లాంట్



నిర్మించుకోవడానికి ప్రభుత్వ అనుమతిని సంపాదించుకుంది.

కోకాకోలా కాన్సన్ ట్రేట్‌లో నాడే కొన్ని వస్తువులను ఇక్కడ ఉత్పత్తి చేస్తారట! నిబంధనల ప్రకారం తయారైన మొత్తంలో 75 శాతాన్ని విదేశాలలోని కోకాకోలా కర్మాగారాలకు ఎగుమతి చేస్తారు. మిగతా 25 శాతాన్ని ఇండియా మార్కెట్‌లో విక్రయిస్తారు.

ప్రస్తుతం ఏడాదికి 12 శాతం రేటు చొప్పున పెరుగుతున్న మన దేశ కూల్ డ్రింక్స్ పరిశ్రమ కోకాకోలా రంగ ప్రవేశంతో చావుదెబ్బ తింటుందని అఖిల భారత శీతల పానీయాల తయారీ సంఘం ఆందోళన చెందుతోంది. కోకాకోలా ముందు మన దేశ కూల్ డ్రింక్స్ తోకముడుస్తాయో లేక 'క్వాలిటీ'ని పెంచి కోకాకోలాతో కయ్యానికి కాలుదువ్వుతాయో కాలమే నిర్ణయించాలి. చూద్దాం ఏం జరుగు తుందో!?

—'కిమ్మా'